విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 5, అక్టోబర్ 2023

మహిళలంటే ఎందుకింత నిర్లక్ష్యం...

- బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి మహిళలు బలి కావాల్సిందేనా...
- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్..
- ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి..

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో వైసీపీ అధికారలోకి వచ్చిన నాటి నుండి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏపి మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జనరల్ బాడి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో నిర్వహించారు. సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమమానికి జాఫర్ సహా పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు నవంబర్ 17,18,19 వ తేదీల్లో నంద్యాల జిల్లా కేంద్రంలో జరగనున్నాయని అదే విధంగా డిశంబర్ మాసంలో జాతీయ మహా సభలు పశ్చిమబెంగాల్ ఖరగ్పూర్‌లో జరుగుతాయని మహిళా సమాఖ్య ప్రతినిధులు అందరూ తప్పని సరిగా హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నంద్యాలలో జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభకు మహిళలతో పాటు హాజరుకావాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ, వైసిపి పాలనలో వయసు తారతమ్యం లేకుండా మహిళలు,బాలికలపై లైంగిక వేదింపులు, అత్యాచారాలు దాడులు అధికమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వీటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల భద్రత కోసం ఆయా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా వాటిని పటిష్టంగా అమలు పరిచక పోవడం మన దౌర్భాగ్యమని విచారం వ్యక్తంచేశారు. మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, భద్రత కల్పించడంలో బిజేపీ, వైసిపి ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని ఏకరువు పెట్టారు. మహిళలు సంఘటితంగా పోరాడి తమ హక్కులు సాధించుకుంటేనే తప్ప వారికి న్యాయం జరిగే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చిత్తూరు జిల్లాలో భవ్యశ్రీని ప్రేమ పేరుతో మోసం చేసి నలుగురు యువకులు నాలుగు రోజులు పాటు అత్యాచారం చేసి చంపారని అసహనం వ్యక్తం చేశారు.కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ బేటి బచావో బేటి పడావో అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే కాని దేశవ్యాప్తంగా ఎక్కడా మహిళలకు న్యాయం జరిగే పరిస్థితి కనబడటం లేదని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో పేరుకు మాత్రమే దిశ చట్టం తెచ్చారని ఆ చట్టం ఎక్కడా పటిష్టంగా అమలు కావడం లేదని తూర్పారబట్టారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని సీఎం జగన్ మద్యనిషేధంపై ఇచ్చిన హామీ తుంగలో తొక్కాడని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు మహిళాలోకం కార్యోన్ముఖులు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర అధ్యక్ష కార్య దర్శులు జానకి, కుర్షిద, వివిధ నియోజక వర్గాల ప్రతినిధులు కమ్మక్క యశోద, శారద, లక్ష్మీదేవి, ఆజ్మ, రామాం జనమ్మ, మమత, సారంబి, మాహబూబ్బి, కవిత, నాగమని, వన్నూరమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత, సమస్యల పరిష్కారానికి పెద్దపీట

ఎస్పీ శ్రీ కేకేఎన్ అన్బురాజన్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం దిశ మహిళా పోలీసు స్టేషన్‌ను బుధవారం ఎస్పీ అన్బురాజన్, దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప, సి.ఐ చిన్న గోవిందులతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, కౌన్సెలింగ్ రూం, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడుతూ పోక్సో, వేధింపులు, తదితర కేసులను సమీక్షించి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. జిల్లాలో మహిళల భద్రత, సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేశామని.. అందరూ ఇదే సంకల్పంతో పని చేయాలని సూచించారు. మహిళల ఫిర్యాదులను చిరునవ్వుతో స్వీకరించి... సావధానచిత్తంగా విని సమస్యల పరిష్కారానికి సత్వర కృషి జరిగేలా దిశ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఈవ్ టీజింగ్, తదితర వేధింపులకు గురయ్యే ప్రదేశాలలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గృహహింస, వరకట్న వేధింపులు, కిడ్నాపులు, బాల్య వివాహాలు, ర్యాగింగ్‌లపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని మహిళలకు మేమున్నామని భరోసా కల్పించేలా 'దిశ' పెట్రోలింగ్ బృందాలు పనిచేయాలన్నారు.

మహిళల సంచారం అధికంగా ఉన్న ప్రదేశాలపై నిఘా ఉంచాలని, రహదారులపై విజిబుల్ పోలీసింగ్ దిశ యాప్ పై అవగాహన కల్పించి ప్రతీ మహిళ డౌన్ లోడ్ చేయించేలా పోలీసు విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా మహిళల సంబంధిత సమస్యలు, వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ ఉంటే జిల్లా ఎస్పీ ఫోన్ నెంబర్ 94407 96800 కు ఫోన్ చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. ఉమెన్ హెల్ప్ లైన్ : 181 చైల్డ్ హెల్ప్ లైన్ : 1098 పోలీస్ హెల్ప్: 112/100 జిల్లా పోలీస్ స్పందన : 9392926803 సీఎంఓ స్పందన :1902 జిల్లా ఎస్పీ : 9440796800 అంబులెన్స్ : 108 వైద్య సేవలు : 104 ఫైర్ : 101 సూసైడ్ ప్రివెన్షన్ ,అవేర్నెస్ : 14416 సెబ్ ఫిర్యాదుల విభాగం: 14500 ఏసీబీ : 14400 సైబర్ మోసాలు : 1930 సైబర్ మిత్ర : 9121211100 హెచ్ ఎంఎస్ 9346917100 సంప్రదించాలలని ప్రజలకు సూచించారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం ..

-: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

విశాలాంధ్ర-రాప్తాడు: గ్రామీణ ప్రాంతాలోని నిరుపేదలకు సైతం మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. గొందిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ పసుపుల హేమావతి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, ఎంపీడీఓ సాల్మన్, తహశీల్దార్ లక్ష్మీనరసింహ, ఈఓఆర్డీ నరసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ డాక్టరుతోపాటు ప్రత్యేక వైద్యులు, ఇతర సిబ్బంది గ్రామాలకే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని... ఆరోగ్యపరంగా ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లు గుర్తిస్తే మెరుగైన వైద్యం కోసం సిఫారసు చేస్తారన్నారు. గత నాలుగున్నరేళ్లుగా గొందిరెడ్డిపల్లికి చెరువుకు ప్రతి ఏటా నీళ్ళు ఇస్తున్నామని... రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ బిజీగా ఉన్నారని... ఇది చాలా సంతోషకరమన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెబితేనే పింఛన్లు, పథకాలు వచ్చేవన్నారు. వైయస్ జగన్ సీఎం అయిన తర్వాత కులమతాలు పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఎక్కడా రూపాయి అవినీతి లేకుండా గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టారన్నారు. అనంతరం

నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ భవనాలను ప్రారంభించారు. తర్వాత రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్తిరెడ్డి, మరూరు ఆది, సర్పంచ్ మిడతల శీనయ్య, ఏడీఏ రవి, ఏఓ శేఖర్ రెడ్డి, అగ్రిబోర్డు కేశవరెడ్డి, నరసింహగౌడ్, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, మరూరు చెన్నారెడ్డి, ఓబిరెడ్డి, పంగా రామాంజనేయులు, మల్లికార్జునరెడ్డి, వివేకానందరెడ్డి, కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధ్రువ, వీఆర్ఓ సుబ్రహ్మణ్యం, వీహెచ్ఏ ప్రియలత తదితరులు పాల్గొన్నారు.

అరటి చెట్లు నరికివేత..

విశాలాంధ్ర-యాడికి: లక్షుంపల్లి గ్రామంలో బుధవారం ఓ రైతుకు చెందిన అరటి తోటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు యాడికి సీఐ శంకర్ రెడ్డి తెలిపారు. లక్షుంపల్లి గ్రామానికి చెందిన బోయ కరిడికొండ కుమార్‌కి చెందిన రెండు ఎకరాల అరటి తోటలోని సుమారు 174 అరటి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. ఘటనా స్థలాన్ని తాడపత్రి డిఎస్పి గంగయ్యతో పరిశీంచామని చెప్పారు. ఫిర్యాదికి గ్రామంలో ఎవరితో కూడా ఎటువంటి రాజకీయ గొడవలు, తగాదాలు కూడా లేవని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అందరికీ వైద్యం అందాలన్నదే లక్ష్యం

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నందు ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అందరికీ ఇంటి దగ్గరికి వైద్యం అందాలి అన్న ఉద్దేశంతో ఈ సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రక్తదానం చేద్దాం.. మరొకరి ప్రాణాలు కాపాడుదాం..

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ

విశాలాంధ్ర-ఉరవకొండ: రక్తదానం చేద్దాం మరొకరి నిండు ప్రాణాన్ని కాపాడుకుందామని ఉరవకొండ సీఐ హరినాథ్ పిలుపు నిచ్చారు. బుధ వారం స్థానిక మహాత్మా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ ఎస్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు హరిప్రసాద్ యాదవ్, కళాశాల కరస్పాండెంట్ షాజహాన్, ప్రిన్సిపాల్ బసవరాజు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమా దాలు ఎక్కువయ్యాయని, ప్రయాణికులు ఎడమవైపున నడవాలని, ద్విచక్ర వాహ నాలు,కార్లలో ప్రయాణించే వారు తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని గుర్తు చేశారు. మహాత్మా డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులతో పాటు కళాశాల సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కేకే ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబాన్ని ఆదుకుంటాం..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం పీసీ కొత్తకోట గ్రామ వలంటీర్ బెస్త లింగమూర్తి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వలంటీర్ బెస్త లింగమూర్తి కుటుంబాన్ని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కెవి రమణతో కలిసి విశ్వేశ్వరరెడ్డి బుధవారం పరామర్శించారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం..

-జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమేద్దాం: మాజీ మంత్రి

విశాలాంధ్ర-అనంతపురం: అసమర్థపాలనతో రాష్ట్రాన్ని దివాలాతయించిన సీఎం జగన్ రాష్ట్ర నుంచి తరిమేద్దామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలో టిడిపి శ్రేణులు చేస్తున్న నిరాహార దీక్షకు బుధవారం సాయంత్రం నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. కాలవ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమేద్దామని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం అనంతపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సాయంత్రం ఆయన సందర్శించి దీక్ష చేస్తున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు.కాలవ మాట్లాడుతూ అందరం సంఘటి తంగా పోరాడవలసిన అవసరం ఏర్పడిందని, ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. వైసీపీని చిత్తుగా ఓడించి జగన్‌ను ఇంటికి సాగనంపే వరకు కలిసికట్టుగా పోరాటం చేద్దామన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి, సైకో జగన్ రాక్షసానందం పొందుతున్నాడని, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మరో ఆర్నెళ్లలో నిన్ను తీహార్ జైలుకు పంపుతామని జగన్ ను హెచ్చరించారు. అధికారం ఉంది కదా అని విచ్చలవిడిగా ప్రతిపక్ష నాయకులను వేధించడం కేసులు పెట్టడం రివాజుగా మారిందని, త్వరలోనే మా తడాఖా ఏంటో చూపుతామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మార్కెట్ మహేష్, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, గోపాల్ గౌడ్, ముక్తియార్, వన్నూర్, నారాయణస్వామి యాదవ్, మనోహర్, జేయం బాషా, డాక్టర్ లక్ష్మీప్రసాద్, గంగవరం బుజ్జి, సున్నం శ్రీనివాసులు, గుండప్ప, ఓబులేసు, తెలుగు మహిళలు స్వప్న, జానకి, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, సుజాత, వరలక్ష్మి, మహేశ్వరి, వసుంధర, సరోజమ్మ, అంజలి, బండి ఆదిలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు. వీరికి వీరాంజినేయులు, గాజుల ఆదెన్న, నటేష్ చౌదరి, మాజీ కార్పొరేటర్ రాజారావు, గొల్ల సుధాకర్ నాయుడు, బంగినాగ, సాకే వెంకటేష్, మంజు, వడ్డే మురళి, సుభాష్ చంద్రబోస్, పరమేశ్వర్, కడియాల కొండన్న, కుళ్లాయప్ప, రమేష్, హసీనా, షరీనా తదితరులు సంఘీభావం తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రుల మోసాన్ని అరికట్టండి

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ నగరంలో ప్రైవేట్ ఆసుపత్రుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని ధనార్జనే ధ్యేయంగా పేద,మధ్య తరగతి సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రాణాల మీద ఉన్న బీతితో తమ రోగాన్ని బాగు చేసుకోవాలని అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్న వారితో ఆసుపత్రి యాజమాన్యం వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యం లేదని ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే డబ్బుతో పాటు ప్రాణాలు కూడా పోయే పరిస్థితి దాపురించిందని ఏకరువు పెట్టారు. గత సంవత్సర కాలంగా నగరంలో అనేక దారుణాలు జరిగాయని మంగళ వారం రాత్రి అమరావతి ఆసుపత్రిలో జరిగిందని స్పష్టం చేశారు.గార్లదిన్నె నివాసి నరేంద్ర పురిటి నొప్పులతో బాధ పడుతున్న తన భార్య మహాలక్ష్మిని అమరావతి హాస్పిటల్‌లో చేర్పించడం జరిగిందన్నారు. చికిత్స పొందుతూ మహాలక్ష్మి తన కడుపులో ఉన్న బిడ్డతో సహా చనిపోయినప్పటికీ భర్తకు తెలుపకుండా తల్లి బిడ్డ ఇద్దరు క్షేమమే అని చెబుతూ డబ్బు చెల్లించుకున్నారని విచారం వ్యక్తంచేశారు.డబ్బు మొత్తం చెల్లించిన అనంతరం తల్లి బిడ్డ ఇద్దరూ చనిపోయారని చెప్పడంతో భర్త నరేంద్ర కన్నీరు మున్నీరుగా విలపించడం జరిగిందన్నారు.అయితే తనకు అసలు విషయం చెప్పకుండా మోసం చేసిన అమరావతి హాస్పిటల్ యాజమాన్యాన్ని తప్పు బడుతూ నరేంద్ర తన బంధువులతో కలిసి ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. గతంలో ఇదే తరహాలో స్నేహలత, చంద్ర హాస్పిటల్లలో సైతం ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నప్పటికీ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం బాధాకరమని విమర్శించారు. ప్రైవేట్ ఆసుపత్రుల మోసాన్ని అరికట్టాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమం తీసుకు వస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి మోహన కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-ఉరవకొండ : రాష్ట్రంలో మహిళా అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఉరవకొండ వైకెపి కార్యాలయంలో బుధవారం ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ కింద రుణాలు మంజూరైన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 125 మంది మహిళలకు ఉన్నతి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పథకం కింద రూ.54.10 లక్షల సున్నా వడ్డీ రుణాలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి రాష్ట్రంలో మహిళలు బాగుండాలనే లక్ష్యంతో పాలన సాగిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ప్రతి పథకం మహిళల పేరుతో ఇవ్వడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు పార్వతమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఏపిఎం శివయ్య, వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, జేసిఎస్ కన్వీనర్ ఆసిఫ్, ఎంపిటిసి హొన్నూరు సాబ్, వార్డుసభ్యులు వసికెరీ మల్లికార్జున, అంగదాల అంజి, జోగి భీమా, పచ్చి రవి, యానిమేటర్లు పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి కృషి : ఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లాలోని బాలల సంక్షేమానికి కృషి చేద్దామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. బుధ వారం రెవెన్యూ, పోలీసు, మహి ళా శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా జిల్లాలోని బాలల సంక్షేమ పోలీసు అధి కారులకు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఒకరోజు శిక్షణ సదస్సు నిర్వ హించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలకు సంబంధించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జేజేబీ ముందు హాజరుపెట్టే సమయంలో పోలీసు అధికారులు సివిల్ దుస్తుల్లో ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పిల్లలను పోలీసుస్టేషన్లలో ఉంచకూడని బేడీలు వేయరాదని, తప్పి పోయిన బాలల విషయంలోను, అఘాయి త్యాలు జరిగినప్పుడు, బాల్య వివా హాల సందర్భాలలో చట్టపరంగా కఠిన చర్యలు తీసు కోవాలన్నారు. అనం తరం.. హైదరాబాద్ నుండి యునిసెఫ్ ప్రతినిధి డేవిడ్ రాజ్ బాలల న్యాయ చట్టం అమలు చేయడంలో పోలీసుపాత్ర అనే అంశంపై ఆన్లైన్ ద్వారా తర్ఫీదు నిచ్చారు. అనంతపురం మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ కె.ఎల్ సుబ్రమణ్యం సిపిఆర్‌పై డెమో క్లాస్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయ భాస్కర్ రెడ్డి, సిడబ్ల్యుసి ఛైర్ పర్సన్ మేడా రామలక్ష్మి, జెజెబి సభ్యులు శ్రీనివాసులు, ఆదినారాయణ, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, ఐసిపిఎస్ అధికారులు చంద్రకళ, నాగలక్ష్మి, రాజేష్, శమీర్, వసంత భానుజ పాల్గొన్నారు.

17న రాష్ట్ర సదస్సుకు తరలిరండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్..

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ కార్మికులు, రైతుకూలీలకు కరవు ఛాయలనుండి ఉపశమనం కావాలని అయితే పాలక ప్రభుత్వాల తీరు అలా కనిపించడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 17 న జిల్లా కేంద్రంలో నిర్వహించే వ్యకాస రాష్ట్ర సదస్సు కరపత్రాలను బుధవారం సీపీఐ ప్రధాన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా రాయలసీమతో పాటు ప్రకాశం, ఉత్తరాంధ్ర తదితర జిల్లాల్లో అత్యంత దారుణంగా కరువు ఛాయలు కమ్ముకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నట్లు "డౌన్ టుఎర్త్" సంస్థ విశ్లేశించిందని గుర్తు చేశారు. వ్యవసాయ పనులు లేక గ్రామాలకు గ్రామలే ఖాళీ అవుతున్నాయని, అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. నిరు పేదలు,వ్యవసాయ కూలీలు, రైతులు, చేతి వృత్తి దారులకు ఉపాధి చూపించాలన్నారు. కరువు పెన్షన్ రూ.10 వేలతోపాటు ప్రతి నెలా 35 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 17న జిల్లా కేంద్రంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు చేశామని వ్యవసాయ కూలీలు, నిరుపేదలు,చేతి వృత్తిదారులు, రైతులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పెద్దయ్య,ఆఫీస్ బేరర్స్ నాగమణి, శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, తరిమెల రామాంజనేయులు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకేకే ఇంజినీరింగ్ కాలేజీకి ఎన్.బి.ఏ గుర్తింపు...

విశాలాంధ్ర -జెఎన్‌టియుఏ: అనంతపురం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ సంస్థ (ఎన్.బి.ఏ.) గుర్తింపు వచ్చింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాల చైర్మన్ డా.పల్లె కిషోర్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ సాంకేతిక విద్యా బోధనలో అత్యంత అధునాతన ప్రమాణాలు, నియమ నిబంధనలు పాటిస్తున్న కళాశాలగా పొందిన పీవీకెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్.బి.ఎ) సంస్థ, కళాశాల బోధనా సిబ్బంది వారి బోధనా పద్దతులు, కళాశాల భవన నిర్మాణాలు, ల్యాబులు, డిజిటల్ లైబ్రరీ, ప్రాంగణ నియామకాలు ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి విధానం జాతీయ - అంతర్జాతీయ ప్రమాణాలకు తీసిపోకుండా నిర్వహిస్తున్నారని తెలిపి, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ మరియు ఎలెక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్.బి.ఎ గుర్తింపు నిచ్చారని, పీవీకెకె ఐటీ యొక్క సామర్థ్యం, విద్యార్థులు పట్ల అంకితభావం తెలుస్తోందని, ఈ గుర్తింపు రావటం కళాశాలకు ఒక గొప్ప మైలు రాయి అని అన్నారు. వైస్ ఛాన్సిలర్ ఆచార్య రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి శ్రీమతి సింధూర, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.బండి రమేష్‌బాబు, డీన్ డా.సంతోష్ రెడ్డి, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్, బాలాజీ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ళు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఈబి దేవి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ .బి .దేవి అధ్యక్షతన కార్యాలయం సమావేశ భవనం నందు నేషనల్ హెల్త్ మిషన్ పథకం లో భాగముగా జిల్లా యందు వుండు వివిధ ఆసుపత్రుల యందు ఖాళీలు 34 స్టాఫ్ నర్సుల పోస్ట్ లను భర్తీ చేయడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఈ బి దేవి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి మాట్లాడుతూ వివిధ ఆసుపత్రుల నందు ఉద్యోగాలు పొందిన వారు మంచి నైపుణ్యంతో ఉద్యోగులుగా ప్రజలకు ప్రాణాలకు సంబందించిన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డా.చెన్నకేశవులు. పరిపాలన అధికారి గిరిజ మనోహర్ రావు, సూపరిండెంట్ విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు సీనియర్ అసిస్టెంట్స్, సురేష్,కమలాకర్ రాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి

అనంతపురం దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కల్గి ఉండటం వల్ల మున్ముందు భవిష్యత్తుకు ఈ అవగాహన దోహదం చేస్తుందని అనంతపురం దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప అభిప్రాయ పడ్డారు. జిల్లా ఎస్పీకేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు అనంతపురం మండలం కురుగుంట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పలు చట్టాల గురించి తెలియజేశారు. దిశ యాప్ డౌన్లోడ్ %ఢ% రిజిస్ట్రేషన్, ఫోక్సో చట్టం, లైంగిక దాడులు, 1098, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు- అనర్థాలు, రోడ్డు భద్రతా నిబంధనల పాటించడంలో భాగంగా హెల్మెట్/ సీట్ బెల్ట్ ధారణ, తదితర అంశాలపై అవగాహన చేశారు. డీఎస్పీతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, దిశ క్లస్టర్ రజియా సుల్తానా, మహిళా కానిస్టేబుల్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు పశువుపాకల తొలగింపు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: గోవిందవాడ గ్రామంలో 174 సర్వేనంబర్ 3.80 ఎకరాల్లో ఇంటి స్థలాలు ఇస్తామని బుధవారం రేవెన్యూ పోలీస్‌లు అదికారులు రైతులకు చెందిన సవపాకలు, గడ్డివాములను ట్రాక్టర్ల యంత్రాలతో బలవంతంగా తొలగించారు. ముందుగా రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, బొమ్మనహాళ్ ఎస్ఐ శివ, తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు రామన్న, నరసింహ మూర్తి, అక్కడికి చేరుకున్నారు. ఇక్కడ స్థానికంగా కొందరు ఇంటిస్థలాల కోసం కోర్టుకు వెళ్లారని ఇది ప్రభుత్వం స్థలం కావడంతో వీటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని గతంలో నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదని అన్నారు. 70 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్నాయని, బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. రెండ్రోజులు సమయమిస్తే తొలగించుకుంటామని వేడుకోవడంతో సరేనేంటూ అధికారులు అవకాశమిచ్చి వెనుతిరిగారు.

బార్ కోడ్ ప్రకారం స్కానింగ్ పక్కా ఉండాలి..

• కలెక్టర్ అరుణ్ బాబు

విశాలాంధ్ర-ధర్మవరం: ఎన్నికలకు నిర్వహించే ఈవీఎం మిషన్లో భాగంగా వీవీ పాట్స్, బ్యాలెట్ యూనిట్లు స్కానింగ్ పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో భద్రపరిచిన వాటిని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో 4800 వివి పాట్స్, దాదాపు 4000 బ్యాలెట్ యూనిట్లను చట్టపరంగా ఓ గదిలో భద్రపరచడం జరిగింది. అనంతరం వాటిని పూర్తి దశలో స్కానింగ్ చేయుటకు గాను మంగళవారం నుండి నిరంతరంగా స్కానింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఆర్డిఓ తిప్పే నాయక్ దగ్గరుండి వాటిని పర్యవేక్షిస్తున్నారు. స్కానింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని తెలిపారు. భద్రత విషయంలో మరింత చర్యలు గైకొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో కొండయ్య, ఆర్డిఓ తిప్పే నాయక్, స్థానిక తహసిల్దార్ యుగేశ్వరి దేవి, కలెక్టరేట్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోసం జల దీక్ష

సిపిఐ, జన సేన నాయకులు సంఘీభావం

విశాలాంధ్ర-పెనుకొండ: మచ్చలేని మహానాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని అరెస్టు చేసి రిమాండ్‌లో ఉంచి నందున ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలుగు దేశం పార్టీ నాయకులు, సిపిఐ, జనసేన నాయకులతో కలిసి గొల్లపల్లి జలాశయం నందు నియోజకవర్గ ఇన్చార్జ్ బీకే పార్థసారథి, నియోజకవర్గ అబ్జర్వర్ నరసింహా యాదవ్ తో కలిసి జల దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 40 సంవత్సరాలుగా రాజకీయాలలో ఉండి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు చూపించారని ప్రతిఒక్కరూ గుర్తు ఉంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 16 నెలలు జైల్లో ఉండి ప్రతిపక్ష నాయకుడు కూడా తన మాదిరిగానే జైలులో ఉండాలని, ఉద్దేశంతో చంద్రబాబును జైల్లో ఉంచారని, ఆయన మచ్చలేని మహా నాయకుడిగా ప్రపంచమంతా వెలిగిన వ్యక్తి కావున ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆయన బయటికి వస్తారని అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని, వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గంగలో కలుపుతారని పేర్కొన్నారు. కార్యక్రమం లో రొద్దం నరసింహులు, జివిపి నాయుడు, కేశవయ్య, వెంకట రాముడు, చిన్నపయ్య, సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, నరసింహ, వెంకటరాముడు తదితర నాయకులు పాల్గొన్నారు.

బిజెపి నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తలుపుల గంగాధర్

విశాలాంధ్ర-కదిరి: భారతీయ జనతా పార్టీ నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తలుపుల గంగాధర్ ఎన్నికయ్యారు. బుధవారం తలుపుల గంగాధర్ మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి,రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్ పార్థసారధి, జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నారు.

కురుబలపై అణచివేత ధోరణి..

- చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా కనగానపల్లిలో భారీ ప్రదర్శన
- అడుగడుగునా అడ్డంకులు సృష్టించిన పోలీసులు
- పెదయ్య స్వామి వద్దకు వెళ్లేందుకు కూడా అడ్డంకులు
- కురుబలు ఏమి తప్పు చేశారో చెప్పాలి..
- పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పార్థసారథి

ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న పరిటాల సునీత ..

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి : జిల్లాలో శాంతి కాముకులుగా గుర్తింపు పొందిన కురుబలపై ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేసే దోరణి కనిపించింది. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బుధవారం కనగానపల్లిలో వందలాది మంది కురుబలు ప్రదర్శన నిర్వహించారు. అయితే ఈ నిరసన కార్యక్రమానికి మొదటి నుంచి పోలీసులు అడ్డంకులు సృష్టించారు. ఈ ప్రదర్శనకు అనుమతి లేదని.ఎవరైనా పాల్గొంటే కేసులు పెడతామని పోలీసులు హెచ్చరిస్తూ వచ్చారు. వీటన్నిం టినీ లెక్కచేయకుండా కురుబలు భారీగా తరలివచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా రావడంతో కనగానపల్లి జనసంద్రంగా మారింది. ముందుగా కురబలంతా ఏ కార్యక్రమం చేపట్టినా తమ కులదైవంగా చెప్పుకునే పెదయ్య స్వామి వద్దకు వెళ్లేందుకు బయలుదేరుతారు. అక్కడ కొబ్బరికాయ కొట్టిన తర్వాత ర్యాలీ నిర్వహించాలని భావించారు. కానీ పోలీసులు వారిని అడ్డుకోవడంతో తమ కులదైవం వద్దకు వెళ్లేందుకు కూడా అడ్డంకులు సృష్టిస్తారా అంటూ వాగ్వాదానికి దిగారు. భారీ సంఖ్యలో కురుబలు తరలిరావడంతో పోలీసులు చివరికి వారిని అనుమతించగా భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టును కురుబలు ముకుమ్మడిగా ఖండించారు. ఏ తప్పు చేయని చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని వారు మండిపడ్డారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కురుబల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని వారు గుర్తు చేసుకున్నారు. ఆయన జైలు నుంచి బయటకు వచ్చేవరకు తాము టీడీపీకి అండగా ఉంటామని కురుబలు స్పష్టం చేశారు.

పోలీసుల ద్వారా అడ్డంకులు సృష్టిస్తున్నది ఎవరు?

మాజీ మంత్రి పరిటాల సునీత

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అన్ని వర్గాల వారు స్పందిస్తున్నారని. అలాగే కురుబలు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చి సంఘీభావం తెలపాలని భావించారని. కానీ దీనిని అడ్డుకునేందుకు పై స్థాయి నుంచి ఒత్తిళ్ల వచ్చాయని మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపించారు. నిన్నటి నుంచి కురుబలు ఈ ర్యాలీలో పాల్గొనకుండా అనేక అడ్డంకులు సృష్టించారని ఆమె ఆరోపించారు. తాము పోలీసులపై ఎలాంటి ఆరోపణలు చేయడం లేదని వారిని వెనక ఉండి నడిపిస్తున్న వారి గురించి మాట్లాడుతున్నామని సునీత స్పష్టం చేశారు. గతంలో కురుబల ఓట్లతో అధికారంలోకి వచ్చిన మీరు ఇప్పుడు వారిని అణచి వేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కూడా ఎవరో చెప్పినట్టు నడుచుకోవడం సరైన చర్య కాదన్నారు. శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తే మీకున్న అభ్యంతరం ఏంటని ఆమె ప్రశ్నించారు. మీరు ఎన్ని ఇబ్బందులు కలిగించిన వారు వెనక్కు తగ్గలేదని ర్యాలీలో పాల్గొని చంద్రబాబుకు సంఘీభావం తెలిపారని సునీత అన్నారు. పోలీసులు కూడా ఈ సంఘటనలో ఏం జరిగిందన్నది ఒకసారి ఆలోచించుకోవా లన్నారు. చంద్రబాబుపై అక్రమంగా కేసులు పెట్టడమే కాకుండా వారికి మద్దతుగా నిలుస్తున్న వారిని కూడా అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే తనపై కూడా చాలా కేసులు పెట్టారని, ఇలాంటి వాటికి భయపడేది లేదని స్పష్టం చేశారు.

కులదైవం వద్దకు వెళ్లేందుకు కూడా అడ్డంకులా..

పరిటాల శ్రీరామ్ ఆగ్రహం

కనుగానపల్లి మండలంలో కురుబలు పెదయ్య స్వామిని తమ ఆరాధ్య దైవంగా భావిస్తారని అలాంటి దైవానికి పూజలు చేసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం ఏంటని పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఎందుకిలా శాంతియుత నిరసనలపై కూడా ఉక్కు పాదం మోపుతున్నారని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లతోనే ఇలా పోలీసులు వ్యవహరిస్తున్నారని కురుబల మనోభావాలు దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కురుబలంతా ఏకమైతే తమ ఉనికికే ప్రమాదం వస్తుందన్న ఆందోళనతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటినుంచి కురుబలకు అండగా ఉందని అలాగే వారు కూడా టిడిపికి మద్దతిస్తూ నిలుస్తున్నారని అన్నారు. ఈరోజు వీరంతా ఐక్యమైతే తమకు ప్రమాదం అన్న భావనతోనే ఈ ర్యాలీలను అడ్డుకుంటు న్నారని శ్రీరామ్ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అన్ని వర్గాలు రోడ్డుపైకి వస్తున్నాయని ఇప్పుడు కురుబలు కూడా ఏకమై అండగా నిలబడటం సంతోషం అన్నారు. అణిచివేత ధోరణలపై రానున్న రోజుల్లో కచ్చితంగా వారు బుద్ధి చెబుతారని శ్రీరామ్ హెచ్చరించారు.

శాంతికాముకులైన కురుబలపై మీ దౌర్జన్యాలు ఏంటి..

జిల్లా అధ్యక్షుడు పార్థసారథి

రాష్ట్రంలో కురుబలు ఎక్కడున్నా అక్కడ ప్రశాంత వాతావరణం ఉంటుందని.. వారు ఎంతో శాంతి కాముకులని శ్రీ సత్య సాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు పార్థసారథి అన్నారు. అలాంటి వారు ఇవాళ రోడ్డుపైకి వస్తున్నారంటే కచ్చితంగా చంద్రబాబుని అక్రమ అరెస్టు చేశారని భావిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. వారు శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే పోలీసులకు వచ్చిన అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. ఎవరో చెప్పినట్టు వింటూ ఇలా బీసీలపై అణిచివేత ధోరణి ప్రదర్శిస్తే.. రానున్న రోజుల్లో మూలం చెల్లించుకుంటారని ఆయన హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీని దెబ్బ తీయాలని చూసే వారంతా ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోయారని త్వరలోనే చంద్రబాబు బయటకు వస్తారని కచ్చితంగా తెలుగుదేశం పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

శీనా హెూటల్ తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

విశాలాంధ్ర-కదిరి: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న శీనా హెూటల్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర తనిఖీ చేశారు. బుధవారం ఉదయం ఆయన హెూటల్ సందర్శన చేసి ఆహార పదార్థాలను తనిఖీ చేసి కొన్ని రకాల పదార్థాలను నాణ్యత కోసం ల్యాబ్ కు పంపినట్లు తెలిపారు. హెూటల్ యజమాని ఎటువంటి ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయడం పట్ల ఆయన ఆవేద వ్యక్తం చేశారు. ల్యాబ్ కు పంపిన సరుకులలో నాణ్యత లేకున్నట్లయితే చట్టపంమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రికెట్ టోర్నీలో ఫ్రెండ్స్ లెవెన్ జట్టు విజయం

విశాలాంధ్ర-అమడగూరు: సెప్టెంబర్ 8న పుట్టపర్తి వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన వైయస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ యువ నాయకులు కొత్తకోట చక్రధర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొట్టువారి పల్లి గ్రామంలో బుధవారం మండల స్థాయిలో జరిగిన ఫైనల్ మ్యాచ్ అట్టహాసంగా నిర్వహించారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఫ్రెండ్స్ లెవెన్ జట్టు 37 పరుగుల తేడాతో అమడగూరు జెట్టు పై విజయం సాధించి మండల స్థాయి విజేతగా నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. యువ నాయకులు కొత్తకోట చక్రధర్ రెడ్డి ఇరుజట్ల ఆటగాళ్లను అభినందిస్తూ టోర్నమెంట్ ఫైనల్ రోజున పుట్టపర్తిలో మండల విన్నర్ ఫ్రెండ్స్ లెవెన్ జట్టుకు రూ.15 వేలు, మండల రన్నర్ అమడగూరు టీం కు రూ.10వేలు ముఖ్య అతిథి చేతుల మీదుగా అందించడం జరుగుతుందన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో జరిగే తదుపరి మ్యాచులకు సిద్ధంగా ఉండమని చెప్పారు. కార్యక్రమంలో యువ నాయకులు కొత్తకోట చక్రధర్రెడ్డి,అమడగూరు సర్పంచ్ షబ్బీర్, రాజారెడ్డి, హరినాథ్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, లక్ష్మి నారాయణ రెడ్డి, ఆర్గనైజర్లు హనుమంత రెడ్డి, శివ,సూర్య, అశోక్ ఇతర నాయకులు కార్యకర్తలు క్రీడాభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

చంద్రబాబు కడిగిన ముత్యంలా వస్తారు..

విశాలాంధ్ర-రొళ్ల: నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ నిరసనగా మేము సైతం బాబు కోసం అంటూ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్లో తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సిపిఐ,సిపిఎం, జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఇంటింటికి వెళ్లి బాబుతో నేను అనే కరపత్రాలను అందజేశారు. అనంతరం వారు దీక్షలో పాల్గొని మాట్లాడుతూ మన అధినేత నారా చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన వ్యక్తి అని, ఆయన్ను అకారణంగా అక్రమ అరెస్ట్ చేయడం దారుణమని, పరిపాలన చాతకాని జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష పార్టీలపై దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ ఇంచార్జ్ ఆర్.జి పవిత్ర, సిపిఎం నియోజకవర్గ ఇంచార్జ్ రామాంజనేయులు, తెదేపా మండల అధ్యక్షుడు దాసిరెడ్డి, టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్.కృష్ణమూర్తి, తెదేపా నాయకుడు ఆర్డబ్ల్యూఎస్ రిటైర్డ్ ఏఈ మల్లికార్జున, తెదేపా నాయకుడు సర్వేయర్ హనుమంతరాయప్ప, తెదేపా మండల కార్యదర్శి జీ.కే ఈరన్న, క్లస్టర్ ఇంచార్జ్ భరత్, నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు బాలకృష్ణ, మాజీ ఎంపీపీలు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల దీవెనలతో చంద్రబాబు విడుదలవుతారు..

- అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపాలి.. - నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర ప్రజల దీవెనలతోనే చంద్రబాబు నాయుడు విడుదల కాబోతున్నారని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పరిటాల శ్రీరామ్ తెలిపారు. బుధవారం 22వ రోజు నిరాహార దీక్షలో కొనసాగుతున్న శిబిరం వద్దకు చేరుకొని సంఘీభావం తెలిపారు. అనంతరం దీక్షలు చేపట్టిన బత్తలపల్లి మండల నాయకులను వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి పార్టీ చిత్తు,చిత్తుగా భూస్థాపితం కాబోతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్ళడానికి కారణం వైసిపి ప్రభుత్వ అసమర్థతే నాని వారు ప్రభుత్వంపై మండిపడ్డారు.

వచ్చేది టిడిపి-జనసేన లతో కూడిన ఉమ్మడి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేకంగా, ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులకు, అధికారులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి, శిక్షించడం జరుగుతుందన్నారు. ప్రజల దీవెనలతోనే మచ్చలేని చంద్రుడుగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో విడుదల కాబోతున్నారని తెలిపారు.

ఈ రాష్ట్రానికి ఒక మంచి క్యాపిటల్ సిటీని తీసుకురావడానికి పేద రైతుల వద్ద నుండి దాదాపు 35 వేల ఎకరాలను సేకరించి, ఒక మంచి రాజధాని నిర్మాణం చేపట్టాలనే లక్ష్యంతో, ఆనాడు అమరావతి నిర్మాణం జరిగితే ఇప్పటివరకు అమరావతి లో ఒక్క ఇటుక కూడా పెట్టి, కట్టలేని వైసీపీ అసమర్థ ప్రభుత్వ తీరును ఆయన ఎండగట్టారు. రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ అయిన పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు హయాంలో 75 శాతం పూర్తిచేస్తే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఒక్క శాతం కూడా పోలవరం ప్రాజెక్టుని పూర్తి చేయలేని అసమర్థ పాలకులు ఈ రాష్ట్రాన్ని పాలించడం శోచనీయమని తెలిపారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగ అమలవుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బత్తలపల్లి టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కాకర్ల సురేంద్ర నాయుడు, బోయ శ్రీనివాసులు, కేశవరెడ్డి, బుజ్జి, కృష్ణారెడ్డి, నాగభూషణ, రామాంజి, చిత్రా నాగభూషణ, సుబ్బరాయుడు, కాటమయ్య, సంఘాల సూరి, నాగార్జున రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, రంగనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలి..

విశాలాంధ్ర-ధర్మవరం: భవ్య శ్రీ హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సాయికిరణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నందగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాలపురంకు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న భవ్యశ్రీని అత్యంత వాసవికంగా చంపేసి బావిలో పడేయడం చాలా బాధాకరమని, ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో మహిళలకు, అమ్మాయిలకు రక్షణ కరువైందని దుయ్యబట్టారు. దిశా చట్టాన్ని, దిశా యాప్ తీసుకొని వచ్చారని, ఏదైనా అమ్మాయిలు, మహిళలపై దాడులు కానీ, వేధించడం కానీ, హత్యాచారము, హత్య చేయడం కానీ ఇలాంటి సంఘటనలు జరిగితే 21 రోజులలో అరెస్టు చేసి వారిని కఠినంగా శిక్షిస్తామన్న ప్రచార ఆర్భాటాలకు మాత్రమే ప్రభుత్వం పరిమితమైం దని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి పది రోజులు గడిచినా కూడా హెూం శాఖ మంత్రి వనిత స్పందించక పోవడం శోచనీయమని తెలిపారు. మహిళా చట్టాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని వారు తెలిపారు. భవ్య శ్రీ మృతికి కాయకులైన నలుగురు నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకుంటూ, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు కోటి రూపాయల ఎక్స్గ్రేషియా కూడా ఇవ్వాలని,ఐదు ఎకరాల భూమి కూడా జీవనోపాధి నిమిత్తం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి అమానీయ సంఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, త్రివిక్రమ్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు విద్య, వైద్యం అందిస్తాం..

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: అన్ని వర్గాల వారికి విద్యతోపాటు వైద్యం కూడా అందించి, చక్కటి ఆరోగ్యాన్ని ప్రసాదించడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కొత్తపేటలో గల వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి 8 సచివాలయాల నుండి ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవలే ఇంటింటా సర్వే జరిపి, ప్రజల ఆరోగ్య పరిస్థితుల జాబితా ప్రకాంం వైద్యులు, ప్రత్యేక వైద్యులచే వైద్య చికిత్సలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. అదేవిధంగా ఐసిడిఎస్ శాఖచే పోషక ఆహార పదార్థాలపై కూడా అవగాహన కల్పించడం సంతోషదాయకమన్నారు. ప్రతి వ్యక్తి రోగం బట్టి తగిన వైద్య చికిత్సతో పాటు ఆపరేషన్‌కు కూడా రెఫర్ చేయడం జరిగిందన్నారు. ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని వివరించారు. పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర గల మారుతీ నగర్లో త్వరలో 13 కోట్లతో తల్లి బిడ్డల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో సాల్మన్, మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ శంషాద్ బేగం, వైద్యులు ఉరుకుందప్ప, జగదీష్, ప్రియాంక, దిలీప్, మాజీ వైస్ చైర్మన్లు భాగ్యలక్ష్మి చెందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, వార్డు ఇంచార్జ్ చాంద్ భాష, ఆశా కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులు వైసీపీ పాలకులు..

విశాలాంధ్ర-కదిరి: పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బాబుకి తోడుగా మేము సైతం రిలే నిరాహార దీక్షలు 22రోజుకు చేరుకున్నాయి.టీడీపీ ఇంచార్జ కంది కుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ చేస్తున్న దీక్షలకు మినీ లారీ ఓనర్స్ ఆటో యూనియన్ నాయకులు, న్యాయవాదులు మద్దతు తెలిపారు. అనంతరం కంది కుంట మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి దేశంలో నరేంద్ర మోడీ,రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ పాలన సాగిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో రెండు పార్టీ లను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహులు, చౌడప్ప, నాగేంద్ర కుమార్, అంజనేయులు, వర ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్ లిస్ట్ జాబితా ఇవ్వండి..

- బీజేపీ నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: 2024లో నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి అర్హత కలిగిన ఓటర్ల జాబితా ఇవ్వాలని , 5/1/2023 నాడు ప్రచురితమైన ఓటర్ లిస్టుతో పాటు అక్టోబర్ 4వ తేదీ వరకు గల ఫారం-6, ఫారం- 7 దరఖాస్తులు ఎన్ని వచ్చాయి? వాటికి సంబంధించిన పూర్తి వివరాలు పట్టణంలోని వార్డుల వారీగా, నాలుగు మండలాల(ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ) వారిగా వివరాలను జిరాక్స్ రూపంలో అర్టీ యాక్ట్ కింద ఇవ్వాలని డీఏవో కతిజూన్ కుప్రాకు బీజేపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి దుస్సా కృష్ణ, బీజేవైఎం అధ్యక్షులు నారాయణస్వామి యాదవ్, లాయర్ దస్తగిరి, గంధమనేని నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

7వ తేదీ వేలం పాట..

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

విశాలాంధ్ర-ధర్మవరం: పురపాలక సంఘ పరిధి నందు గల కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ కు సంబంధించిన మొదటి అంతస్తు బ్లాక్-1 నందు తొమ్మిది రూములు బ్లాక్-4 నందు రెండు రూములకు(ఈనెల 27వ తేదీన వేలం వేయగా మిగిలిన షాపు రూములకు మాత్రమే) ఈనెల 7వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణము నందు బహిరంగ వేలము నిర్వహిస్తున్నట్లు పురపాలక కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఆసక్తిగల వ్యాపారస్తులు ఇతర వివరముల కొరకై మున్సిపల్ కార్యాలయ పనివేలల యందు రెవెన్యూ విభాగమునందు సంప్రదించాలని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

16 వరకు కోర్టు విధులు బహిష్కరణ

బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్బారావు

విశాలాంధ్ర-ధర్మవరం: కోర్టులో పిటిషన్లకు రూపాయి స్థానంలో రూ.20 లు స్టాంపు వేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయవాదులు వ్యతిరేకించారు. దీనిపై బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ కోర్టులో రోజు వందల సంఖ్యలో న్యాయవాదులు తమ కక్షిదారుల తరఫున పిటిషన్లు దాఖలు చేస్తూ స్టాంపు అతికించే వాళ్ళని ఈ స్టాంపు స్థానంలో ఈనెల ఐదు నుంచి 20 రూపాయల విలువ గల స్టాంపును అతికించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. దీనిపై ధర్మవరం బార్ అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశము నిర్వహించి, న్యాయవాదులు ముక్తకంఠంతో రాష్ట్రబార్ కౌన్సిల్ తీర్మానాన్ని వ్యతిరేకరించడం జరిగిందని తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని తరహాలో రాష్ట్రంలో స్టాంపులను పెంచుతున్నారని, కక్ష దారులు న్యాయం పొందలేని పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవడం సరికాదని, నిర్ణయం వెనక్కి తీసుకొనే దాకా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

చెరువుకుంట ఆక్రమణపై ఫిర్యాదు

విశాలాంధ్ర-ఎన్ పీ కుంట: మండల పరిధిలోని పి కొత్తపల్లి పంచాయతీ దండే వారి పల్లి సమీపంలో ఉన్న ద్వారణాల చెరువు కుంట ఆక్రమణపై చీమలచెరువు పల్లి రైతులు బుధవారం తహసిల్దార్ నరేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ద్వారణాల చెరువు కుంట సర్వేనెంబర్ 60 లో 16 ఎకరాల 68 సెంట్లు విస్తీర్ణం ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో చెరువు విస్తీర్ణం సగానికి సగం తగ్గిపోయి ఉన్నట్లు రైతులు వివరించారు.